క్లుప్తంగా

వాల్మీకి జయంతిని సెలవుగా ప్రకటించాలి


మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

కోవెలకుంట్ల: ఈ ఏడాది నుంచి వాల్మీకి జయంతిని అధికారికంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామమని.. అయితే జయంతిని ప్రభుత్వ సెలవు రోజుగా ప్రకటించాలని వాల్మీకి సంఘం నాయకులు ఎంవీ సుబ్బయ్య, వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీ వాల్మీకి జయంతిని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అధికారికంగా జరపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. సంఘం నాయకులు రంగడు, మధు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

బనగానపల్లె రూరల్: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమశాఖ ద్వారా ఇచ్చే డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని బనగానపల్లె సహాయ సాంఘిక శాఖ అధికారి రాముడు సోమవారం తెలిపారు. ఎస్జీటీలకు ఇంటర్‌తో పాటు డైట్‌సెట్, టెట్,స్కూల్ అసిస్టెంట్స్‌కు డిగ్రీతో పాటు బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోగా http://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత బోధన, భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

సీసీరోడ్డుకు భూమి పూజ


ఆకుమల్లలో భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీడీఓ సాల్మాన్ సోమవారం భూమి పూజ చేశారు. ఆకుమల్ల గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మండలంలో సీసీరోడ్లు, డ్రైన్‌ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.4.30 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రాధికా రెడ్డి, విజయకుమార్ రెడ్డి, సర్పంచ్ వెంకటయ్య, ఏపీఓ ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

వెండి పళ్లెం కానుక


ఆలయ పూజారులకు అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి సోమవారం నంద్యాల పట్టణానికి చెందిన టి.శ్రీకాంత్ కుటుంబ సభ్యులు కేజీ బరువు గల రెండు వెండి పళ్లేలు కానుకగా సమర్పించారు. అలాగే ధర్మవరంకు చెందిన కందిగుంట శ్రీనివాసులు కుటుంబ సభ్యులు రూ.45వేల విలువ చేసే వెండి హారతి పల్లెంను ఆలయ పూజారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమామహేశ్వరునికి ప్రత్యేక పూజలు


ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉదయం శివపార్వతులకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఐక్యంగా ఉద్యమించాలి

డోన్ టౌన్: మదాసి, మాదారి కురువలకు ఎస్సీ కులధ్రువీకరణ పత్రాల కోసం ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని మాదారి కురువ, మాదాసి కురవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రంగన్న పిలుపునిచ్చారు. సోమవారం ఆ సంఘం అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. మాదాసి, మాదారి కురవలు గ్రామాలకు దూరంగా అడవిలో ఉంటూ గొర్రెలు కాస్తూ దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

- గుంతలమయంగా మారిన గ్రామీణ రోడ్లు
- వాహనదారులకు ఇబ్బందులు
- కనీసం గుంతలైనా పూడ్చాలని గ్రామస్తుల వేడుకోలు
- సంజామల-ముదిగేడు మార్గం మరీ దారుణం


ముదిగేడు సమీపంలో రోడ్డుపై పడిన భారీ గుంతలు

సంజామల: మండలంలోని గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారాయి. ఆ రోడ్లు చూస్తే భద్రంగా ఇంటికి చేరుకుంటామా అన్న సందేహం కలగకమానదు. మండల కేంద్రం సంజామల నుంచి ముదిగేడు వరకు సుమారు 7 కిలోమిటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది.ఈ రోడ్లపై భారీ గోతులు ఏర్పడడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఈ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు హడలిపోయే పరిస్థితి నెలకొంది. ఎన్నికల్లో గెలిచాం ఇక మాకేం సంబంధం అని ప్రజాప్రతినిధులు.. మాకెందుకులే అని అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

కొత్త రోడ్డు దేవుడెరుగు.. గుంతలైనా పూడ్చండి

ఈ ఏడాది కురిసిన వర్షాలకు ముదిగేడు-సంజామల రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై గుంతలు ఏర్పడడం.. వాటిలో వర్షపు నీరు చేరడం..భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు మొత్తం ఛిద్రమైంది. నిత్యం ఏదో ఒక గుంత వద్ద వాహనదారులు కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. కొత్త రోడ్డు దేవుడెరుగు గోతులైనా పూడ్చండి సార్ అంటూ వాహనదారులు, రైతులు అధికారులను వేడుకుంటున్నారు. కొలిమిగుండ్ల మండలంలో ఉన్న రాంకో సిమెంట్ ఫ్యాక్టరీకి సంజామల రైల్వేస్టేషన్ నుంచి ట్రాక్‌లైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ప్రతి రోజు భారీ వాహనాల తాకిడి ఎక్కువ కావడంతో రోడ్డు మరింత దారుణంగా తయారైంది. సంజామలకు డబుల్ రోడ్డు ఎప్పుడు వేస్తారో అని వాహనదారులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

రోడ్ల మంత్రి చొరవ చూపేనా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండోసారి ఎమ్మెల్యే అయిన బీసీ జనార్ధన్‌రెడ్డికి రోడ్లు భవనాల శాఖ మంత్రి పదవి వరించింది. బనగానపల్లె నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి బాటలు వేస్తారా లేక తన సంతోషం చూసుకుంటారా అనే చర్చ జరుగుతోంది. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా అభివృద్ధి పనులపై దృష్టి సారించడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


ఎగ్గోని గ్రామం సమీపంలో అధ్వానంగా మారిన రోడ్డు


ముదిగేడు-సంజామల దారిలో దుస్థితికి చేరుకున్న కల్వర్టు


సంజామలలో గుంతలమయంగా ఉన్న రోడ్డు

ఆటో తరచూ మరమ్మతులకు గురవుతోంది



నేను ఆటో నడుపుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. రోజు రూ.500 వరకు సంపాదిస్తున్నాను. ముదిగేడు నుంచి సంజామల వరకు రోడ్డు చాలా దెబ్బతింది. వర్షకాలం కావడంతో గోతుల నిండా వర్షపు నీరు నిల్వ చేరింది. గుంతల వల్ల ఆటో తరచూ మరమ్మతులకు గురవుతోంది. వచ్చిన నగదు ఆటో రిపేర్లకే సరిపోతోంది. ఇక కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. అధికారులు స్పందించి కనీసం గుంతలైనా పూడిస్తే బాగుంటుంది.

–మల్లె సిద్ధయ్య, ఆటో డ్రైవర్, సంజామల

గుంతలైనా పూడ్చండి సార్



రోడ్డుపై ఎక్కువగా గుంతలు ఉండడంతో ఆటో నడిపేటప్పుడు చాలా ఇబ్బందిగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందా అని భయం వేస్తోంది. రోడ్డు వేయకున్నా కనీసం గుంతలైనా పూడిస్తే కొంచెం ఉపశమనం కలుగుతుంది. 7 కిలోమీటర్ల ప్రయాణానికి 30 నిమిషాలు పడుతోంది. ఎదురుగా బస్సు, లారీ వస్తే ఇక అంతే సంగతి. రోడ్డు నుంచి ఆటోను కిందకు దింపుదాం అనుకుంటే అడుగులోతు గుంత ఉంటుంది.

–ఉస్సేన్ వలీ, ఆటో డ్రైవర్, సంజామల


కోవెలకుంట్ల-నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో రోడ్డు దుస్థితి

ఆదమరిస్తే.. అంతే

కోవెలకుంట్ల: మండల పరిధిలోని పలు ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని కోవెలకుంట్ల– నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో పెట్రోల్ బంకు వద్ద రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. కోవెలకుంట్ల– బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో శివాస్పోర్ట్స్ సమీపంలో రోడ్డు దెబ్బతింది. ఈ రెండు ప్రాంతాల్లో వాహన చోదకులు అతి సమీపం వచ్చే వరకు రోడ్డు శిథిలావస్థకు చేరుకున్న విషయం గుర్తించలేని పరిస్థితి. ఈ కారణంగా ఆయా ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


కోవెలకుంట్ల-బనగానపల్లె రహదారిలో దెబ్బతిన్న రోడ్డు



డోన్‌లో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు, ప్యాపిలి: రంగులు చల్లుకుంటున్న యువకులు

ఘనంగా గ్రామోత్సవం

డోన్ టౌన్: దసరా ఉత్సవాల సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు సోమవారం అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు. పాతబస్టాండ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద విజయవాడ కనకదుర్గాదేవి భక్తులు ఏర్పాటు చేసిన అమ్మవారి భారీ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

ప్యాపిలి: విజయదశమి వేడుకల్లో భాగంగా సోమవారం వాసవీమాత గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి పురవీధుల మీదుగా ఊరేగింపు సాగింది. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. యువకులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజా మురళీకృష్ణ, ఆర్యవైశ్యులు గురుప్రసాద్ గుప్త, జొన్నలగడ్డ హరి, సుధీర్, శేషు, గిరి, సునీల్, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, కిశోర్, ఫణి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

కోవెలకుంట్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి పథంలో నడిపించేందుకే పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల స్పెషల్ ఆఫీసర్ శివారెడ్డి తెలిపారు. సోమవారం అమడాల, సొదరదిన్నె, గుంజలపాడు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

బేతంచెర్ల: గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని నోడల్ అధికారి బషీరున్నిసా బేగం, ఎంపీడీఓ రహిమాన్ కోరారు. బుగ్గానిపల్లె తండా, గోరుమానుకొండ తండాలో సీసీరోడ్లకు భూమి పూజ చేశారు.

కొలిమిగుండ్ల: బెలుం, శింగవరం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు.

ప్యాపిలి: ప్యాపిలి, పోతుదొడ్డి, పెద్దపొదిళ్ల, కలచట్ల తదితర గ్రామాల్లో నిర్వహించిన భూమిపూజలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ బాలకృష్ణుడు, పీఆర్ ఏఈ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని 22 గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

బనగానపల్లె రూరల్: మండలంలోని పసుపల, పెద్దరాజుపాళెం, గులాంఅలియాబాద్, చెర్లోకొత్తూరు గ్రామాల్లో రూ.75లక్షలతో చేపట్టనున్న పనులకు ఎంపీడీఓ వెంకటరమణ భూమి పూజ చేశారు.

సిబ్బంది లేక కార్యాలయం వెలవెల


సిబ్బంది లేక ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న ఎంపీడీఓ కార్యాలయం

కోవెలకుంట్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. సోమవారం ఉదయం 11.30 గంటలైనా ఒక్కరూ లేకపోవడంతో కార్యాలయం వెలవెలబోయింది. ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు పల్లె పండుగ కార్యక్రమానికి వెళ్లారు. అడ్మినిస్ట్రేషన్ అధికారి, సీనియర్ అసిస్టెంట్, అటెండర్ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్ సెలవులో ఉన్నారు. మిగిలిన సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా వాసవీమాత వసంతోత్సవం


అమ్మవారి ఊరేగింపులో సందడి చేస్తున్న ఆర్యవైశ్యులు

బేతంచెర్ల: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక అమ్మవారిశాలలో వాసవీ మాతకు సోమవారం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్యులు, యువకులు రంగులు చల్లుకుంటూ వాసవీమాతకు జై అంటూ గ్రామ పురవీధుల మీదుగా పల్లకీలో వాసవీమాతను ఊరేగింపు చేశారు. ఆయా కాలనీల్లో మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఇష్టారాజ్యంగా పార్కింగ్


పార్కింగ్ చేసిన బైక్‌లు

కొలిమిగుండ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ద్విచక్ర వాహనదారులు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. ప్రయాణికులు బస్టాండ్‌లో కూర్చునేందుకు.. వెళ్లేందుకు వీలు లేకుండా బైక్‌లు నిలపడంతో ఇబ్బందులు పడుతున్నారు. మూడు జిల్లాల సరిహద్దులో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ మీదుగా వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వచ్చే సమయంలోనూ డ్రైవర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బైక్‌లు బస్టాండ్ పరిసరాల్లో ఎక్కడ పడితే అక్కడ ఆపుతున్నారు. బస్టాండ్ సెంటర్‌లో ఉండడంతో చాలా మంది బైక్‌లను నిలుపుకుని బస్టాండ్‌లో గంటల తరబడి కూర్చుని పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మందు బాబులు సైతం ఇక్కడే తిష్టవేయడంతో పాటు అక్కడే మద్యం సేవిస్తున్నారు. మహిళలు, వృద్ధులు వచ్చినా లేవకుండా అక్కడే మకాం వేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో కంట్రోలర్‌ను నియమించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మహిళపై దాడి

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన ఉసేనమ్మపై ముగ్గురు మహిళలు దాడి చేసి గాయపరిచారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పోగాకు మల్కిసాహెబ్ పొలం దగ్గర ఉసేనమ్మ పొలం ఉంది. ఇరువురికి పొలం రస్తా విషయంలో కొంతకాలం నుంచి సమస్య నడుస్తోంది. ఉస్సేనమ్మ ఇంటి పక్కన మల్కిసాహెబ్ బంధువు మాబ్బి ఇల్లు ఉంది. ఉస్సేనమ్మ ఇంటి దగ్గర ఉన్న సమయంలో మాబ్బి కుటుంబ సభ్యులు గొడవ పడ్డారు. ఎప్పుడూ తమ బంధువు పొలం విషయంలో గొడవ పడుతుంటావా అని మాబ్బి, సకిన, రసూల్‌బి, బాబు కలిసి కర్రతో దాడి చేశారు. ఉస్సేనమ్మకు తలకు బలమైన గాయం కావడంతో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని నలుగురికి గాయాలు

అవుకు: ప్రైవేట్ బస్సు ఢీకొని నలుగురు గాయపడిన ఘటన అవుకు సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఓవీఆర్ ట్రావెల్స్ బస్సు తాడిపత్రి రహదారి వైపు వెళ్తూ సాయిబాబా ఆలయ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలను ఒకటి తర్వాత ఒకదాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అవుకు పట్టణానికి చెందిన రాఘవ, విశ్వనాథ్‌లకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించారు. మరో బైక్‌పై వస్తున్న నబిరసూల్, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం బనగానపల్లె ఆస్పత్రికి తరలించారు.

మద్యం దుకాణాలు కూటమి వశం

కోవెలకుంట్ల: నూతన మద్యం విధానంలో భాగంగా నంద్యాల కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సోమవారం మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ తబీబాషా తెలిపారు. కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 11 మద్యం దుకాణాలకు 150 దరఖాస్తులు అందాయన్నారు. కోవెలకుంట్ల మండలంలో ఐదు దుకాణాలకు 77, సంజామలలో నాలుగు షాపులకు 38, దొర్నిపాడులో ఒక షాపునకు 17, ఉయ్యాలవాడలో ఒక దుకాణానికి 18 చొప్పున దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. లక్కీడిప్‌లో షాపులు దక్కించుకున్న వారికి దుకాణ లైసెన్స్‌లు అందజేశామన్నారు. కోవెలకుంట్ల షాపు నంబర్ 82ను రామేశ్వరరెడ్డి, షాపు నంబర్ 83– గణేష్, 84–బాబాఫకృద్దీన్, 85– వరలక్ష్మి, 86– రాంమూర్తి, దొర్నిపాడు(87)–భాస్కర్‌రెడ్డి, సంజామల(88) –రాగిరమేష్, సంజామల (89)– సురేంద్రనాథరెడ్డి, 90– మధునాగేంద్ర, షాపు నంబర్ 91–సంతోష్‌కుమార్. ఉయ్యాలవాడ(92)– కొండయ్య దక్కించుకున్నట్లు వెల్లడించారు.

మూడు దుకాణాలు కూటమి నాయకులకే

కొలిమిగుండ్ల: మండలంలోని మూడు దుకాణాలు కూటమి నాయకులకే వచ్చాయి. బెలుం గుహలు, కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లెలో మద్యం దుకాణాలకు మొత్తం 38 దరఖాస్తులు వచ్చాయి. బెలుం గుహల దుకాణాన్ని బనగానపల్లె మండలానికి చెందిన అధికార పార్టీ నేత లాటరీలో దక్కించుకోగా కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె దుకాణాలు మండల వాసులకే వచ్చాయి. కూటమి నాయకులు చాలా వరకు సిండికేట్‌గా ఏర్పడి రూ.2లక్షలు చెల్లించి దరఖాస్తు చేశారు.

డోన్‌లో అన్నీ టీడీపీ సొంతం

డోన్ రూరల్: డోన్ నియోజకవర్గంలో మొత్తం 16 మద్యం దుకాణాలకు 385 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి వర్గానికి 6 దుకాణాలు దక్కాయి. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వర్గానికి 4, తటస్తులకు 6 దుకాణాలు వచ్చాయి. టీడీపీ నాయకులు, తటస్తులు అందరూ కలిసి సిండికేట్‌గా మారడానికి చర్చలు జరుపుతున్నారు.

కూటమి నేతలదే..

బనగానపల్లె రూరల్: బనగానపల్లె మండలంలో ఏడు దుకాణాలకు 105 మంది దరఖాస్తు చేసుకున్నారు. లక్కీ డీప్‌లో ఐదు దుకాణాలను కూటమి నాయకులే దక్కించుకోగా మరో రెండు ఇతరులు దక్కించుకున్నారు. షాపు నంబర్ 54– విష్ణువర్ధన్ రెడ్డి, 55– చాకలి చెన్నయ్య, 56–మదన్‌గోపాల్‌రెడ్డి, 57–వేణుగోపాలరావు,58–విష్ణువర్ధన్‌రెడ్డి, 59– మదన్‌గోపాల్‌రెడ్డి, 60– రామలింగారెడ్డి దక్కించుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ కమలాకర్ తెలిపారు.

సీహెచ్‌సీలో రోగులకు అన్నదానం

బేతంచెర్ల:పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో గర్భిణులు, రోగులకు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, రాజు ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు.లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని వైద్యుడు చరణ్‌రాజు కొనియాడారు.క్లబ్ సభ్యులు వలిబాషా,మనోహర్‌రెడ్డి,ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బేతంచెర్ల: గేదెలు ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడి ముగ్గురు గాయపడిన ఘటన బేతంచెర్ల సమీపంలోని అయ్యల చెర్వు వద్ద సోమవారం చోటుచేసుకుంది. బేతంచెర్ల పట్టణానికి చెందిన ఫాతిమా, మాబాషా, నబీ రసూల్ అయ్యల చెర్వు వద్ద ఆటో ఎక్కారు. కొంత దూరం వెళ్లాక వెనుక నుంచి గేదేలు వచ్చి ఆటోను ఢీకొట్టాయి. ఆటో బోల్తాపడింది. ఫాతిమా, మాబాషా, నబి రసూల్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లప్పవీధి, బేతంచెర్ల రోడ్డు, చాకిరేవుమిట్ట తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన


పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

బనగానపల్లె రూరల్: కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకులు పసుపు రిబ్బన్లు ధరించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 3,618 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పని చేస్తున్నారని తెలిపారు. వీరి క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం 114 జీఓ విడుదల చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ జీఓను అమలు చేయాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 19వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.